


# మంచు తుఫాను

మూలం : అలెగ్జాండర్ పుష్కిన్ — అనువాదం : 'బ్రహ్మచారి'

పద్ధెనిమిదివందల పదకొండవ సంవత్సరాంతంలో 'గావ్రిలా గావ్రిలోవిచ్' తనస్వంత యెస్టేటు 'నెనరాడోవో'లో వుంటున్నాడు. ప్రేమ, దయ గలవాడని ఆ ప్రాంతమంతటా ఆయనకు మంచి పేరు వుంది. ఆయన దగ్గరకు యెప్పుడూ యెవరో ఒకరు వస్తూనే వుండేవారు. కొందరు ఆడుకోవడానికని, కొందరు వాదులకని, కొందరు ఆయన కుమార్తెను చూడడానికని మిషలమీద వచ్చేవారు. ఆయన భార్య "ప్రస్కోవియా పెట్రోవ్నా" దగ్గరకు గూడా స్నేహభావంగా వచ్చేవారు. కూతురు 'మార్యా గావ్రిలోవ్నా' మంచి అందగత్తె. ఆమెని వివాహం చేసుకుందామని కొందరూ, తమ పుత్రులకయినా కుదుర్చుకుందామని కొందరి అభిప్రాయాలు.

మార్యా సైన్యంలో పనిచేస్తున్న బీదవాడిని ప్రేమించింది. అతని పేరు 'వ్లాడిమిర్' శెలవు మీద యింటి దగ్గర వుంటున్నాడు. మార్యా తల్లిదండ్రులు యిందుకిష్టపడలేదు. కాగా 'వ్లాడిమిర్'ని అవమానంగా చూచారు. ప్రేమ గౌరవాభిమానాల్ని యెరగడు. 'వ్లాడిమిర్' 'మార్యా'ని ప్రేమిస్తూనే వున్నాడు.

రహస్యంగా పాడుపడిన చర్చిలోగాని, ప్రక్కన వున్న అడివిలోగాని కలుసుకొంటూ వుండేవారు. శాశ్వతమైన వాళ్ళ ప్రేమని ముచ్చటించుకొనేవారు. వాళ్ళ కర్మను చింతించుకొని కళ్ళనీళ్ళని కాన్కగా యిస్తూవుండేవారు.

"మనం ఒకర్ని విడిచి ఒకరు వుండలేనప్పుడు, మన మధ్యవున్న అడ్డంకులను యెందుకు తొలగించుకోకూడదని" చాలా ఆలోచించారు. వ్లాడిమిర్‌కు చక్కని అభిప్రాయం తట్టింది.

ఇంతలో చలికాలం ప్రారంభమయింది. వాళ్ళు కలుసుకోవడానికి అవకాశంలేదు. 'వ్లాడిమిర్' ప్రతి వుత్తరంలోనూ "మనం రహస్యంగా పెళ్ళి చేసుకుందాము. కొన్నాళ్ళు దాగిన తరువాత బయటపడి తల్లిదండ్రుల్ని కలుసుకుందాము. అప్పుడు మనల్ని ఆశీర్వదించకపోరు" అని వ్రాసేవాడు.

చాలా రోజులు 'మార్యా' యిందు కిష్టపడలేదు. కాని ఒప్పుకోక తప్పింది కాదు.

అనుకున్న రోజు మార్యా తలనొప్పిగా వుందని రాత్రి భోజనము మానుకోవాలి. దాసీదాని సహాయంతో వెనక మెట్లగుండా తోటలోకి వెళ్ళాలి. తోటప్రక్కన స్లెడ్జి బండి వుంటుంది. అదెక్కి సగానరి అయిదు మైళ్ళ దూరంలో వున్న 'జాద్రేనో' చర్చికివచ్చి వేయాలి. అక్కడ 'వ్లాడిమిర్' రెడిగావుంటాడు. ఇదేప్లాను

అనుకున్నరోజు తెల్లవారుతే వస్తుంద నగా 'మార్యా'కి నిద్రపట్టలేదు. చలికోటు యితర గుడ్డలూ అన్నీమూటగా కట్టింది. తన స్నేహితురాలికి, తల్లిదండ్రులకు చెరో వుత్తరము వ్రాశి తాను చేస్తున్నపని తప్పు అయినా అనివార్యమైందనీ, తనకు జీవితంలో మళ్ళీ యెప్పుడయినా తల్లిదండ్రుల పాదసేవ చేయగల్గే భాగ్యము గల్గితే అంత కన్నా సుదినము వుండబోదని వ్రాసింది.

తెల్లవారగానే ఆ ఉత్తరాలను ప్రక్కమీద పడేసింది. రాత్రి అంతా నిద్రలేదు. ఒకటే పీడకలలు. తాను స్లెడ్జి యెక్కుతూవుండగా తన తండ్రి వచ్చి క్రిందకులాగి, మంచుమీద బరబరా ఈడ్చి, అగాధంలో పడేసినట్లు, రక్తశిక్తమైన గుడ్డలతో వ్లాడిమిర్ గడ్డిమీద పడి "మార్యా నన్ను పెళ్ళిచేసుకోవూ" అని దీనంగా అడిగినట్టు కలవచ్చింది. ఆమె ముఖము వివర్ణమైపోయింది. అమ్మానాన్నా గూడా "అమ్మాయీ ! ఏమిటి యిలా వున్నావు. వంట్లో కులాసాగాలేదా" అని అడిగారు. హుషారుగావున్నట్లు నటించా లనుకుంది. కాని ఆమె అలా చేయలేక పోయింది.

సాయంత్రమయింది. ఈ కొన్ని గంటలేగా యీ యింట్లో, యీ పరిసరాల్లో వుండేది. యిది తలచుకున్నప్పుడు ఆమె ప్రతి అవయవము బిగుసుకుపోయింది. మనస్సులో ప్రతి వస్తువుతోనూ శలవు తీసుకుంది.

రాత్రి భోజనపు వేళయింది. ఆమె హృదయంలో ఆరాటం హెచ్చింది. వణకుతున్న పెదవులతో "భోజనమువద్దు తలనొప్పిగావుంది" అని మాత్రము అన గలిగింది. అమ్మా నాన్నాగూడా యథా ప్రకారంగా ముద్దుపెట్టుకుని దీవించి పంపారు. నిష్కళంకమైన ఆ ముద్దుతో ఆమె హృదయం ద్రవించింది. యేలాగో యేడ్వకుండా ఆపుకుంది.

ఆ ప్రియమైన మాటలు విన్న తరువాత యేడ్వకుండా యెలా సాధ్యమవుతుంది ? గదిలోకి వచ్చిం తరువాత కళ్ళ నీళ్ళు వెల్లువలయిపారినవి. హృదయము కొంచెము తేటపడింది. దాశీది మాత్రము ధైర్యంగా వుండమని బుజ్జగించింది. ఇంకో అరగంటలో నూతన జీవితము ప్రారంభమవబోతూంది. తన తల్లిదండ్రుల్ని, తన యింటిని, కన్యాత్వాన్ని శాశ్వతంగా వదలుకోబోతూంది.

ఇంతలో మంచు తుఫాను చెలరేగింది. గాలి అతి భయంకరముగా వీవసాగింది. కిటికీ తలుపులు డాంఢాంమని గ్రుద్దుకొన్నాయి. ఇదంతా తన దురదృష్టమేమోనని అనుకుంది 'మార్యా.'

ఇల్లంతా అతి నిశ్శబ్దంగా వుంది. అందరూ గాఢసుషుప్తిలో వున్నారు. మార్యా వున్నికోటు వేసుకుంది. పెట్టె ఒక చేత్తో పట్టుకుంది. దాశీది రెండు గుడ్డల మూటలు తెస్తోంది. తుఫాను యింకా తగ్గలేదు. ఇద్దరూ అతి కష్టం మీద బండి దగ్గరకు చేరారు. 'వాడిమిర్ బండి వాడు' చాలా సేపటినుంచి వేచి వున్నాడు. గుర్రము చలి మూలాన సరిగా నుంచోటములేదు.

'వ్లాడిమిర్‌కు రోజల్లా క్షణము తీరిక లేదు. అటూ యిటూ తిరుగుతూనే వున్నాడు. ఉదయం జాడ్రౌన్ మతాధికారి వద్దకు వెళ్లి, బ్రతిమాలి యిందుకు వప్పించాడు. తరువాత సాక్షులకోసం ప్రక్క యిళ్ళ వెంబడి తిరిగాడు. డ్రేవిన్ అనే ముసలి వుద్యోగి యిందుకు సంతోషంగా అంగీకరించాడు. భోజనాలయినాక కోరమీసము మెలివేసుకుంటూ 'సాబిమిట్' కన్పించాడు. కెప్టెను కొడుకు పదహారేళ్ళ వాడయినా యిందుకు యిష్ట పడ్డాడు. వాళ్ళిద్దరు 'వ్లాడిమిర్' ధైర్యానికి మెచ్చి అవసరమైతే ప్రాణాన్ని గూడ యిస్తా మన్నారు. వ్లాడిమిర్ సంతోషాశ్రువులతో వాళ్ళిద్దరినీ కౌగలించుకున్నాడు. తరువాత యింటికివచ్చి అవసరకార్యాల్ని చక్క బెట్టుకున్నాడు.

చీకటి బాగా అలముకుంది. నమ్మకమైన 'టెరోష్కా' (వ్లాడిమిర్ బండి మనిషి)ని బండితో మార్యాయింటికి పంపాడు. జాడ్రౌన్ బండిమీద వెళ్ళడానికి యిరవై నిమిషాలు పడుతుంది. మంచి రహదారే వుంది. ఒంటిగానే బండిమీద బయలుదేరాడు. అరగంట గడిచింది. జాడ్రౌన్ ప్రక్కనవుండే పొదలుగూడా కన్పించలేదు. ఇంకా పదినిమిషాలు గడచినా ఊరు కనపడ లేదు. తుఫాను యింకా తగ్గలేదు. ఆకాశము మేఘాలతోనే క్రమ్ముకునివుంది. గుర్రముబాగా అలిసిపోయింది. మంచులో మెడదాకా కూరుకుపోతూన్నా వ్లాడిమిర్‌కు బాగా చెమట పట్టింది.

తప్పుడు దారిలో బండినడుస్తూందని వ్లాడిమిర్ గ్రహించాడు. కొంచెము సేపు ఆగి ఆలోచించి కుడిప్రక్కగా నడిపాడు. గంటసేపు పైగా బండి రోడ్డుమీదనడిచింది. జాడ్రౌన్ కనిపించలేదు. ఎంతసేపూ బండి కుడిప్రక్కగా నడుస్తోంది. వ్లాడిమిర్ మనస్సు చింతాకులమైంది. దూరంగా యేదో నల్లనివస్తువు కన్పించింది.

ఆశలు చిగిర్చాయి. బండి గమనాన్ని అటువైపు మళ్ళించాడు. దగ్గరకు వెళ్ళగానే అవి పొదలు. "రక్షించావు దేవుడా! యెక్కువ దూరం లేదు" అనుకున్నాడు. పొదల ప్రక్కగా బండి నడుస్తోంది. తనకు తెలిసిన మార్గమని మోసపోయాడు. ఎంత దూరము వెళ్ళినా జాడ్రౌన్ రాలేదు. అదొక అరణ్యము. మంచు గురవడము తగ్గకపోయినా, గాలి మాత్రము పెద్దగాలేదు. హుషారుగా గుర్రాన్ని చంకీతో కొట్టాడు. పాపము! అలసటతో క్రుంగిపోయింది. ఒక్క అడుగు గూడా వేయలేని స్థితికి వచ్చింది.

కొంచెము సేపటికి అడవిని దాటాడు. జాడ్రౌన్ మాత్రము కనపడలేదు. అర్ధరా

త్రేయినట్లుంది. అశ్రుధారలు జ ల జ లా రాలాయి. మేఘాలు అదృశ్యమయినయి. పెనుగాలి తగ్గిపోయింది. ఆకాశము నిర్మలంగా వుంది. రోడ్డంతా మంచుచేత తెల్లని దుప్పటి పరచినట్లుంది. దూరంగా యేదో వూరు కన్పడింది. అక్కడ నాలుగయిదు గుడిశెలకన్నా యెక్కువ లేవు. మొదటి ఇంటి దగ్గరకువెళ్ళి తలుపు ద బ ద బా బాదాడు. కొంచెము సేపటికి కిటికీ రెక్కలు తెరచుకున్నాయి. ముసలాడు జవాబు చెబుతున్నాడు.

"ఏం గావాలి?" అంది ముసలికంఠం.

"జాడ్రౌన్ యెంతదూరంలో వుంది."

"జాడ్రౌన్! చాలాదూరమే" ఆవులిస్తూ అన్నాడు.

"అదే! అదే! యెంతదూరము."

"అబ్బే యెంతదూరమోలేదు పది మైళ్ళు."

దీంతో వ్లాడిమిర్ గుండె ఆగిపోయినపర్యంతమైంది. వెర్రిగాజుట్టుపీక్కున్నాడు.

"ఎక్కడనుండి వ స్తు న్నా వు" అన్నాడు ముసలాడు.

వ్లాడిమిర్ బదులు చెప్పకుండానే "జాడ్రౌన్ పోవడానికి గుర్రాలను అద్దె కీయగలవా" యెదురు ప్రశ్న వేసాడు.

"గుర్రాలా! మాబోటి వాళ్ళ దగ్గర వుంటాయా, నాయనా!" అన్నాడా పేదరైతు.

"పోనీ! నాతో యెవరైనా పంపుతావా దారిచూపడానికి. యెంతడిగినా యిచ్చుకుంటాను."

"అయితే ఆగు! మా అబ్బాయిని పంపిస్తా". తలుపులు మూసుకున్నాయి. వ్లాడిమిర్ ఒకనిమిషం ఒక యుగంలాగా గడిపాడు. ఆదుర్దావల్ల మళ్ళీ తలుపు బాదడం మొదలెట్టాడు.

"మళ్లీ కేక వేసేవు దేనికి" అన్నాడు ముసలాడు.

"మీఅబ్బాయి వచ్చేదా ! రాండా" అన్నాడు.

"వస్తున్నాడు బూట్లుదొడుక్కుని. చలిగావుందా. లోపలికిరా ! వెచ్చ చేసుకో" అని ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"సరేగాని! మీ అబ్బాయిని త్వరగా పంపు"

తలుపు కీచుమంది. కర్రచేత్తో పుచ్చుకుని ము సి లా డి కొ డు కు బయటకు వచ్చాడు. కర్రతో రో డ్డు కో స ము వెదుకుతూ ముందుకు నడిచారు.

"టైమెంతయి వుంటుంది" ప్రశ్నించడు వ్లాడిమిర్.

"తెల్లవారొస్తోంది" అని చెప్పాడా కుర్రవాడు.

వ్లాడిమర్ మాట్లాడకుండా ముందుకు నడిచాడు.

కాకులు అరుస్తున్నాయి. జాడ్రౌన్ చేరేటప్పటికి బాగా వెలుగు వచ్చింది. రైతు కొడుక్కి డబ్బిచ్చి పంపేశాడు. చర్చి తాళము వేశివుంది. తన సౌందర్యరాశి, మార్యా అక్కడలేదు. ఏం ఆపద మూడనున్నదోగదా !

"సెనద్రాదో"లో యేంజరిగిందో చూదాము.

ముసలివాళ్ళు లేచి, సరాసరి నైట్ గౌన్స్‌తోనే 'టీ' గదిలోకి వచ్చారు. మార్యా రాత్రి నిద్రపట్టిందో లేదో యెలా గడిపిందో — రాత్రి కనుక్కోరమ్మని నౌకరును పంపారు. నిద్రపట్టక పోయినా కొంచెము నెమ్మదిగానే వుందని యిప్పుడు టీ కోసము వస్తుందని నౌకరు చెప్పాడు. తరువాత 'మార్యా' వచ్చి ప్రాతకాలాభివందన చేసింది.

"తలనొప్పి యెలా వుందమ్మాయి" అడిగాడు తండ్రి.

"ఫరవాలేదు నాన్నా! అంది ఆప్యాయతని నటిస్తూ.

"నిన్నటి కోల్ గాస్ మూలంగా నొప్పివచ్చి వుంటుంది" అంది తల్లి కారణము గ్రహించినట్లుగా.

"అయితే కావచ్చు అమ్మా" అంది.

పగలుబాగానే గడిచింది. రాత్రికి మార్యాకు జ్వరం వచ్చింది. ఒస్తే డాక్టరు కోసము కబురు చేశాడు. జ్వర తీవ్రత హెచ్చింది. ఇలా రెండువారాలు గడిచినయి.

జ్వరము యెందుకు వస్తూందో ఎవరికీ తెలియదు. ఆ సాయంకాలము వ్రాసిన ఉత్తరాలు చించివేయబడ్డాయి. యజమాని కోపమెరిగిన దాశీది అసలు విషయాన్ని బయటపెట్టలేదు. ఆ చిదంబర రహస్యము ఈ ఆడ్డురిమధ్య నలుగుతోంది.

మార్యా జ్వరపు మగతలో అసలువిషయాన్ని పిచ్చి పిచ్చి మాటలుగా అంటూ వుండేది. అనేమాటల్లో ఒకదానికొకదానికి సంబంధము లేకపోవడము మూలాన విషయాన్నెవరూ ఆకళించుకోలేకపోయారు. తల్లి మాత్రము నిజాన్ని గ్రహించింది. భర్తతో, పొరుగింటివాళ్ళతో యీ విషయాన్ని చర్చించింది. మార్యా విధి యిలా వ్రాసిపెట్టిందనుకున్నారు. స్త్రీ కోరుకున్న భర్తను తప్ప ప్రాణావసాన సమయంలో గూడా ఇతరుల నొల్లదు. బీదతనమనేది తప్పుకాదు. ఆమె డబ్బుని పెండ్లిచేసుకోబోవడములేదుగా! వరించిన పురుషుణ్ని వివాహం చేసుకోవడంలో తప్పేముంటుంది, అని అనుకున్నారు అందరూ.

కొంచెము కొంచెముగా మార్యా ఆరోగ్యము కోలుకుంటూంది. వ్లాడిమిర్ ఆ యింటి ప్రక్కగా గూడ చాలాకాలం దాకా కన్పించలేదు. అందరూ యిష్టపడ్డ తరువాత "తమ కూతుర్నిచ్చి వివాహము చేస్తామని" కబురు పంపారు వ్లాడిమిర్‌కు. అతని జవాబు విన్న ప్రతివారి ఆశ్చర్యానికి అంతులేదు. ఇక ఎన్నటికి ఆ యింట్లో అడుగు పెట్టననీ యీ పేదజీవిని మరచిపొమ్మని, తనకిక మరణమే శరణ్యమని వ్రాశాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు మళ్ళీ వ్లాడిమిర్ సైన్యంలోకి వెళ్ళాడని తెలిసింది. ఇది 1812 లో జరిగింది.

చాలాకాలం యీ విషయాన్ని యెవరూ బహిరంగ పరచలేదు. మార్యా గూడా 'వ్లాడిమిర్' పేరెయెత్తలేదు. కొన్ని నెలల తరువాత 'బొరోడినో' వద్ద అతి ప్రమాదకరంగా గాయాలు తగిలిన వారి లిస్టులో 'వ్లాడిమిర్' పేరు గూడా వుంది. మార్యా యిది చూచి మూర్ఛపోయింది.

అందరూ మళ్ళీ వెనకటిజబ్బు వస్తుందేమో ననుకున్నారు. దైవకృపవల్ల అలాటిదేమీ రాలేదు.

ఇది యిలా వుండగా మార్యాని మరొక దురదృష్టము యెదుర్కొంది. తండ్రి 'గావ్రిలా గావ్రినోవిచ్' మరణించాడు. ఎస్టేటుకిప్పుడు తానే అధికారిణి. ఇది ఆమెనికించిత్తయినా సంతోష పరచలేదు. తన తల్లి దుఃఖాన్ని సగభాగము ఆమె గూడా పంచుకుంది. తల్లిని విడనాడనని ప్రతినచేసింది. ప్రస్తుతముంటున్న వూరుని వదిలేసి వేరే యింకో వూరులో మకాము పెట్టారు.

మార్యాకు సంబంధాలమీద సంబంధాలు వస్తున్నాయి. కాని యేవొక్కదానికి తలవొగ్గలేదు. తల్లి యీ విషయాన్ని అనేక సార్లు నొక్కి చెప్పింది. తలవూపటమే ఆమె సమాధానము. వ్లాడిమిర్ అయినా ఆటే కాలము బ్రతకలేదు. మాస్కోని ఫ్రెంచివాళ్ళు ఆక్రమించగానే చనిపోయాడు. ఇంతటితోనైనా వ్లాడిమిర్ని మరచి పోలేదు — మార్యా అతని స్మృతి చిహ్నంగా, అతడు తెచ్చిన పుస్తకాల్ని, తనకోసము ప్రత్యేకంగా యేరివ్రాసుకొచ్చిన పద్యాల్ని, అతడు వ్రాసిన చిత్రాల్ని జాగ్రత్తగా దాచింది. ఈ విషయాలు తెలుసుకున్న పొరుగు వాళ్ళ ఆశ్చర్యానికి అంతులేదు. అందరూ 'పాపము! ధన్యజీవి' అన్నారు.

ఇంతలో యుద్ధము ఆగిపోయింది. ఇతర దేశాల్లో వున్న సైనికులు యిళ్ళకు తిరిగి వస్తున్నారు. సైనికుల వుత్సాహోద్వేగాన్ని చూచిన ప్రతివారి మనస్సు గగుర్పొడవక మానదు. చిన్నప్పుడు యుద్ధములోకి వెళ్ళినవారు పెద్దవాళ్ళయి యింటికి తిరిగివస్తున్నారు. మీసాలు, గడ్డాలు, వక్షంలో జుట్టు వారి యౌవన రేఖల్ని తెలియపరుస్తున్నాయి. ఎక్కడ చూచినా జార్ చక్రవర్తి నినాదాలే.

అప్పుడు రష్యను స్త్రీల వుత్సాహానికి అంతులేదు. వాళ్ళలో యిదివరకున్న ముభావము యిప్పుడు లేదు. సంతోషంలో 'హుర్యా' అని అరిచారు. టోపీలను గాలిలో యెగరవేసారు వుత్సాహ చిహ్నంగా.

ఈ సంతోషసమయంలో 'మార్యా' తన తల్లితో ఒక పల్లెటూరిలో వుంటూంది. అందుచేత యీ వుత్సవాలసంగతి వాళ్ళకు తెలియదు. పల్లెలోగాని సైనికోద్యోగి వున్నాడంటే యెంతో గౌరవమూ గొప్పానూ.

ఇదివరకటి మాదిరిగానే మార్యాకు సంబంధాలు వస్తున్నాయి. యథాప్రకారంగానే ఆమె త్రోసిపుచ్చుతూందిగూడా. 'కలోనియల్ బర్మిన్' హుస్సార్స్‌లో అడుగుపెట్టగానే మార్యా దగ్గరకు యెవరూ రావడము మానుకున్నారు. బర్మిన్ యెస్టేటుదారు. యెస్టేటువ్యవహారాలు చూచుకోవడానికని శెలవుమీద హుస్సార్స్ వచ్చాడు. అతనివయస్సు యిరవైఆరేళ్ళు. హుస్సార్స్ మార్యా వుండేవూరికి దగ్గరలోనేవుంది. ఎందుకనోగాని బర్మిన్ అంటే మార్యాకు ఒక విధమైన అభిప్రాయమేర్పడింది. అతని సమక్షంలో ఆవిడ కిదివరకున్న సలత లేదు. ప్రేమగల్గిందని చెప్పటానికి

వీలులేదు గాని కథ అదే ధోరణిలో నడుస్తోందని చెప్పడానికి సందేహము లేదు.

బర్మిన్ అందమైనవాడే. అతనిదగ్గర యేదో స్త్రీలను ఆకర్షించే మహత్తరశక్తి వుంది. మార్యా యెదుట స్వచ్ఛందముగానే ప్రవర్తించేవాడు. ఆమెకళ్ళు యెల్లప్పుడూ అతని కళ్ళను, ఛాతీనీ వెన్నాడేవి. అతనొకప్పుడు రౌడీ అయినప్పటికీ యిప్పుడు మంచివాడే. పూర్వము దుర్మార్గుడయినా, ప్రస్తుత సన్మార్గతని అందరు స్త్రీలు హర్షించినట్లే, మార్యాగూడా అంగీకరించింది.

అతని అందానికన్నా, సంభాషణ పాటవముకన్నా, అంగనిర్మాణానికన్నా, అతనిలోవున్న మౌనము ఆమెని తెలియకుండానే అతనివైపు లాగింది. తనంటే బరిన్‌కు యిష్టములేదను కొనేది ఒకోసారి. తన ప్రేమని అన్నివిధాలా వెల్లడించింది. బర్మిన్ యిది తెలిసి గూడా మెదలకుండా వూరుకున్నాడు. మరి ఒకోసారి యిష్టమున్నట్లే నటించేవాడు. ఏశక్తి యిలా తనవైపు మొగ్గకుండా అవుతుందో అని ఆమె ఆలోచించింది. భయం మూలకంగానా— లేక గర్వమా, ఇది చాలాసేపు ఆమెని కలవర పెట్టింది. చివరికి భయపడి యిలా వర్తిస్తున్నాడని నిర్ణయించుకుంది. ఇకనుంచి జాగ్రత్తగా హెచ్చరించాలనుకుంది. అవసరమైనప్పుడు బయట పెట్టాలి. ఇది కూడా బర్మినును వంచలేక పోయింది. ఆశగా ఆమె కళ్ళు యెప్పుడూ బర్మిన్ వైపే చూస్తూవుండేవి. ఇరుగు పొరుగువాళ్ళ వ్యవహారము పైసలయినట్టుగా ఎప్పుడు పెళ్ళి చేద్దాము అనేవారు. తల్లి గూడా సరైన సంబంధము కుదిరిందిగదా అని సంతోషించింది.

ఒకనాడు మార్యాతల్లి 'టీ' గదిలో కూర్చునివుంది. బర్మిను రావడమే తడవుగా "మార్యా యెక్కడవుంది" అని అడిగాడు.

"తోటలోవుంది నాయనా. వెళ్లు మీకోసము నేను యెదురు చూస్తూ వుంటాను అంది."

బర్మిన్ అటు వెళ్లాడు. మార్యా తల్లి సెలువని తల్చుకుని "ఈవేళ తేలిపోవచ్చు" అనుకుంది.

మార్యా కొలనుదరిని, వృక్షచ్ఛాయలో పొత్తము చేబూని వెల్లవసనంబుల ధరించి నవలారాణివోలె వెలుగుచూవుంది. అవీ ఇవీ మాటలాడుకున్న తరువాత కావాలని ఆ సంభాషణని ఆపివేసి తన స్వవిషయం లోకి దింపింద. ఇప్పుడు 'బర్మిను' ఏవిధంగాను తప్పించుకోవడానికి వీలులేదు.

బర్మిను యీ వలలో యిరుక్కుని వుక్కిరి బిక్కిరి అయ్యాడు. గత్యంతరము లేక యిక చెప్ప మొదలెట్టాడు. "చాలా రోజులనుండి నా హృదయాన్ని విప్పి చెప్పాలనుకుంటున్నా" అని ప్రారంభించాడు. మార్యా పుస్తకం మూసివేసి నిశ్చలంగా వినడానికి తయారయింది.

"నిన్ను ప్రేమించా. గాఢంగా ప్రేమించా" అన్నాడు. ఆమె సిగ్గుతో తల వాలేసుకుంది. రోజూ నీ దగ్గరకు రావడంలో మరో తప్పుగూడా యిమిడి వుంది. మార్యా కొంచెం తడబడింది.

"నేను నా జీవితాన్ని చక్కదిద్దుకునే అవకాశము యేనాడో జారిపోయింది. కాని నీ ప్రేమమూర్తిని మరచిపోలేను. మనిద్దరి మధ్య అగాధము యేర్పడే విషయాన్నిప్పుడు చెప్పబోతున్నాను."

"ఆ అగాధం యెప్పుడూ వుంటుంది. నేను భార్యగా యెన్నటికీ వుండలేను." అంది బర్మన్‌కు అడ్డుగా.

"నాకా విషయము తెలుసు. నువ్వొకర్ని ప్రేమించావని మూడేళ్ళనుండి ఆ విషయాన్ని గురించి బాధ పడుతున్నావని నే నెరుగుదును." అన్నాడు విచార వదనంతో.

"దేవుని కోసమన్నా ఆ విషయము చెప్పబోకండి. నన్ను నిలువునా కాల్చివేశారు." అన్నది మార్యా.

"అవును. నాకు తెలుసు. నువ్వేనాదానివైతే అనుకునేవాణ్ణి... నేనే యీ ప్రపంచములో దురదృష్ట జీవిని. నాకు... నాకు... పెళ్ళి అయింది." కళ్ళనీళ్ళ పర్యంతంగా.

మార్యా ఆశ్చర్యంగా చూచింది.

"నాకు పెళ్ళి అయింది" అని ప్రారంభించాడు మళ్ళీ. "నాలుగు సంవత్సరాలయింది. నా భార్య యెవరో, యెలా వుంటుందో యెక్కడ వుందో, మళ్ళీ చూడగలనో లేదో గూడా నాకు తెలియదు."

"ఏ మంటున్నారు." అంది ఆశ్చర్యంగా మార్యా. "ఎంత గమ్మత్తుగావుంది. చెప్పండి... చెప్పండి... చెప్పరూ... ప్రార్థిస్తున్నా." అంది దీనంగా.

బర్మిన్ చెప్పడం మొదలెట్టాడు. "1812 లో మా రెజిమెంటు విల్నాలో వుంది. ఒకనాడు ప్రక్కవూరికి పనిమీద వెళ్ళాను. సాయంత్రము తిరిగి రావడానికి బండి యెక్కుతూండగా 'మంచుతుఫాను' ప్రారంభమయింది. అక్కడవున్న వాళ్ళు ఆగిపొమ్మని సలహాయిచ్చారు. అందుకొప్పుకున్నాను. కాని యెంతసేపటికీ తుఫాను తగ్గలేదు. ఇకలాభంలేదని బండి మీద బయలుదేరాను. బండి నదివడ్డు వెంబడి నడుస్తోంది. ఇలా వెళ్ళితే మూడు మైళ్ళు దగ్గరని చెప్పాడు బండివాడు. ఎంతదూరము పోయినా వూరురాలేదు. చివరకు దూరంగా యేదో సన్నని వెలుతురు కన్పించింది. బండి అటు నడిచింది. అది వకచర్చి. గేటు దాటిలోపలకు వెళ్ళగానే "దారియిటు! యిటురండి" అని కొన్ని గొంతుకలు అరిచినయి. బండివాడు అటువేపు పోనిచ్చాడు.

"ఓరిదేవుడా! నువ్విప్పటిదాక యెక్కడ పచార్లు చేస్తున్నావయ్యా! పాపము. ఆ అమ్మాయి మూర్ఛపోయింది. మతగురువు అయోమయంలో పడ్డాడు. దబ్బున దిగిరావయ్యా!" అని యెవరో అన్నారు. నేను బండి దిగాను మారు మాటాడకుండా. చర్చిలోపల కీనీడలో ఒక అమ్మాయి కూర్చునివుంది. ఇంకో మనిషి ఆమె కణతలను రుద్దుతూంది.

"ఇప్పటికయినా వచ్చావు. అందుకు సంతోషించాలి." అందాకణతలు రుద్దుతూన్న అమ్మాయి. మత గురువు "యిక ప్రారంభించేదా" అన్నాడు. "అలాగేకానీయిండి" అన్నాను అయోమయావస్థలో.

ఆ అమ్మాయిని యిద్దరు యువతులను తీసుకువచ్చారు. కొంచెము అందంగానే వుంది. నేనెవరినో యేంజరుగుతూందో గూడా నాకు తెలియదు. నా ప్రక్కన ఆ అమ్మాయి నుంచునివుంది.

మత గురువు త్వరత్వరగా వ్యవహారము పూర్తిచేశాడు. సాక్షుల సంతకము గూడా అయింది. మా విచిత్ర వివాహము జరిగిపోయింది.

"ఒకర్నొకరు ముద్దు పెట్టుకోండి." అన్నారు సాక్షులు.

"నా భార్య నా వంక తిరిగింది. నేను ముద్దు పెట్టుకో బోతున్నాను. ఇంతలో "ఇతను గాదు! ఇతను గాదు" అని ఆమె అరిచింది.

"అందరూ నా వంక ఆశ్చర్యంగా చూచారు. నేను ఒక్క దూకున బండిలో బడి పారిపోయాను." అని తన చరిత్ర చెప్పాడు బర్మిను.

"తరువాత నీ భార్య విషయం యేమయిందో నీకు తెలియదూ ?" అంది కొంటెగా.

"పెళ్ళి అయిన వూరి పేరు గూడా తెలియదు. ఏ వూరినుంచి అక్కడికి చేరానో గూడ తెలవదు. పెండ్లి విషయము నాకు స్వప్న వృత్తాంతంగా వుంది. అందుకని బండిలో హాయిగా నిద్ర పట్టింది. తెల్లవారి లేచిచూస్తే బండివాడు చలి మూలాన చచ్చిపోయి వున్నాడు. ఇందు మూలంగా ఆ విషయాన్ని కనుక్కోవడానికి ఆస్కారం లేక పోయింది." అని చరిత్ర ముగించాడు. నిట్టూర్పుతో.

"ఓరి భగవంతుడా! అయితే నువ్వే! నన్ను గుర్తించలేదూ !" అంది పాణిని గ్రహిస్తూ.

బర్మిన్ అత్యానందంతో ఆమె పాదాల వద్ద మోకరిల్లాడు.

